క్లుప్తంగా

రైతుల కోసమే పొలం పిలుస్తోంది



దాచేపల్లి : పంటల సాగులో రైతులకు సూచనలు, సలహాలు అధిక దిగుబడులు సాధించేలా చేయటం కోసమే ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తుందని ఏవో డి.పాపకుమారి అన్నారు. దాచేపల్లి, నడికుడిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంటల సాగుపై రైతులకు పలు సూచనలు చేశారు. పంటల సాగులో రసాయన ఎరువులు అధికంగా వాడవద్దని, తక్కువ మోతాదులో పురుగు మందులు వాడి ఎక్కువ దిగుబడులు సాధించాలని ఏవో చెప్పారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి



దాచేపల్లి : చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని నాలుగవ కోర్టు అదనపు న్యాయమూర్తి శరత్‌బాబు అన్నారు. నారాయణపురంలోని ఫాతిమా దివ్యాంగుల పాఠశాలలో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. దివ్యాంగులతో న్యాయమూర్తి శరత్‌బాబు మాట్లాడి చట్టాలపై వివరించారు. అనంతరం దివ్యాంగులందరికీ ఉచితంగా వైద్య పరీక్షలు డాక్టర్ ఇమ్మడిశెట్టి అమూల్య ఆధ్వర్యంలో నిర్వహించారు. త్వరలో దివ్యాంగులకు సదరన్ సర్టిఫికెట్లు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని డాక్టర్ అమూల్య చెప్పారు. ఈ కార్యక్రమంలో గురజాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందపాటి శ్రీనివాసరెడ్డి, డాక్టర్లు ఆంజనేయులు, రాంబాబు, ప్రవీణ్‌కుమార్, ప్రిన్సిపాల్ అమలకుమారి, సహాయకురాలు మరియారాణి, హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మయ్య, ఏఎన్ఎం రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ నమోదు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

పిడుగురాళ్ల: ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ అన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 20వ తేదీ 26వ వార్డు సచివాలయం ఎల్ఐసీ కృష్ణారావు బజారు పరిధిలోని సెయింటాన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఆధార్ నమోదు కేంద్రం నిర్వహించటం జరుగుతుందన్నారు. అదే విధంగా 21న మారుతినగర్, లెనిన్ నగర్ సచివాలయం 17లోను, 22వ తేదీ వడ్డెర కాలనీలోని 7వ సచివాలయంలో నిర్వహించటం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ

మాచవరం: మండలంలోని సింగరాయపాలెం తండాలోని ఎంపీపీ పాఠశాలను ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. పాఠశాలలో వసతులు, మౌలిక సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన నిర్వహణ, మెనూ తదితర అంశాలపై సిబ్బందితో చర్చించారు. అనంతరం గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నూతనంగా నిర్మిస్తున్న మినీ గోకుల షెడ్లను పరిశీలించారు. ఆయన వెంట ఏపీఓ వెంకటేశ్వర్లు నాయక్, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి

పిడుగురాళ్ల: పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ అన్నారు. పట్టణంలోని 9వ వార్డు, మెయిన్ బజారులో చెత్త తొలగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీధర్ మాట్లాడుతూ... ప్రజలు కూడా చెత్తను మురుగు కాలువల్లో వేయకుండా ఉండాలని, చెత్త వేయటం వలన కాలువల్లో నీరు పారటం లేదని, దాని వలన దీర్ఘకాలిక వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అన్నారు. మున్సిపల్ కార్మికులు కూడా చెత్తను వేర్వేరుగా సేకరించాలని, తడి చెత్త, పొడి చెత్తను వేరుగా ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు పలు సూచనలు, సలహాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నకేశవుని సన్నిధిలో స్వాములకు చద్ది

కారెంపూడి: దీక్షలు చేస్తున్న స్వాములకు చెన్నకేశవస్వామి సన్నిధిలో అన్నదాన కార్యక్రమం కొనసాగుతోంది. గ్రామస్తుల సహకారంతో ఆలయ అర్చకులు కొమండూరి సత్యనారాయణాచార్యులు కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. రోజుకు సుమారు 400 మంది అయ్యప్పలు, ఆంజనేయస్వామి దీక్ష స్వాములు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి, చద్ది చేసి వెళ్తుండడంతో చెన్నకేశవస్వామి ఆలయంలో కార్తిక శోభ అలరారుతోంది. కార్తిక మాసం మొత్తం అన్నదాన కార్యక్రమం కొనసాగుతుందని అర్చకులు తెలిపారు.

కన్నెగంటి ఘాట్‌ను అభివృద్ధి చేయండి

- నిర్లక్ష్యానికి గురైన కన్నెగంటి ఘాట్
- పోరాట యోధుని విగ్రహాన్ని ప్రతిష్టించలేని దుస్థితి
- సమర యోధుని చిహ్నాన్ని కాపాడుకోవాలి



కోలగుట్లలోని కన్నెగంటి హనుమంతు ఘాట్

దుర్గి: పల్నాటి బెబ్బులి, పుల్లరి ఉద్యమ నేత, ప్రముఖ స్వాతంత్య్ర సమర యోధుడు కన్నెగంటి హనుమంతు ఘాట్ చిట్టడవిని తలపిస్తున్న దృశ్యం మండల పరిధిలోని కోలగుట్ల సమీపంలోని కన్నెగంటి ఘాట్‌లో నెలకొంది. పల్నాడు జిల్లాలో ఏకైక తొలితరం సమర యోధుడిగా పేరొందిన కన్నెగంటి హనుమంతు ఘాట్‌ను దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో మాజీ మంత్రి, ప్రస్తుత శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ, స్థానిక కాపు సంఘ నాయకులు, కన్నెగంటి సేవా సమితి సభ్యులు సహకారంతో కోలగుట్ల సమీపంలో కన్నెగంటి ఘాట్‌ను నిర్మించారు. భారీ స్థూపాన్ని ఆయన జ్ఞాపికగా ప్రతిష్టించి చుట్టూ ప్రహరీ గోడను నిర్మించారు. గత సంవత్సరం తెనాలి ప్రాంతానికి చెందిన ఎన్ఆర్ఐ చందూ శ్రీనివాసరావు తన సొంత నిధులను వెచ్చించి కన్నెగంటి విగ్రహాన్ని నెలకొల్పాలని సంకల్పించారు. దానికనుగుణంగా స్థానిక కళాకారులకు ఆ బాధ్యతను అప్పగించి విగ్రహాన్ని తయారు చేయించారు. సంవత్సరం దాటినా స్థానిక ప్రజా ప్రతినిధులు, సేవా సమితి సభ్యులు, నాయకులు విగ్రహ ప్రతిష్టకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఘాట్ లోపల పిచ్చి కంప, ముళ్ల చెట్లు విరివిగా ఉండి పాములు, తేళ్లు, విష సర్పాలతో నిలయంగా మారిపోయింది. ప్రతి సంవత్సరం కన్నెగంటి హనుమంతు జయంతి, వర్ధంతి కార్యక్రమాల రోజు తూతూ మంత్రంగా కంపను తొలగిస్తూ ఆ రోజులను నిర్వహిస్తున్నారు. శాశ్వతంగా కంప చెట్లను తీయించి, పూల చెట్లను, మోటార్‌ను ఏర్పాటు చేసి సిమెంట్ బల్లలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. సువిశాలమైన ఘాట్‌ను ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించి పునర్నిర్మించాలని హనుమంతు జ్ఞాపకార్థం చేపట్టిన ఘాట్ అభివృద్ధికి కృషి చేయాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



ఘాట్‌లో ప్రతిష్టించని కన్నెగంటి హనుమంతు విగ్రహం

కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించాలి



వెనుకబడిన పల్నాటి ప్రాంతంలో స్వాతంత్య్ర సమర యోధుడు కన్నెగంటి హనుమంతు చరిత్ర ప్రతి ఒక్కరికీ ఆదర్శమని, ఆయన జ్ఞాపకార్థం నిర్మించిన ఘాట్‌ను అభివృద్ధి చేయటమే ఆయనకు ఘనమైన నివాళి. కూటమి ప్రభుత్వం తరపున స్థానిక శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి జోక్యం చేసుకొని ప్రత్యేక నిధులు తెప్పించి అభివృద్ధి చేయాలని కోరుకుంటున్నాం. రాబోయే జెడ్పీ సమావేశాల్లోనూ ఈ అంశాన్ని ప్రస్తావించి నిధులు రావటానికి కృషి చేస్తాను.

– శెట్టిపల్లి యలమంద, జెడ్పీటీసీ, దుర్గి

శాశ్వత ప్రాతిపదికన ఘాట్ అభివృద్ధికి చర్యలు



భవిష్యత్ తరాలకు తెలిసేలా కన్నెగంటి హనుమంతు ఘాట్‌ను శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేయటానికి ప్రణాళికలు రూపొందిస్తున్నాను. వచ్చే వర్ధంతి నాటికి స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, సేవా సమితి సభ్యులు, ప్రజల సహకారంతో ఘాట్ అభివృద్ధికి కృషి చేస్తాను. ఘాట్ లోపల ప్రత్యేకంగా పిచ్చి కంపను తొలగించి, సింగిల్ ఫేజ్ మోటార్‌ను, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు దాతల సహకారంతో ఏర్పాటు చేయటానికి సంకల్పించాను.

– గుండాల వెంకటేశ్వర్లు, కన్నెగంటి సేవా సమితి నాయకులు

వైభవంగా బాలనాగేంద్ర స్వామి తిరునాళ్ల



స్వామి వారి ఉత్సవ విగ్రహానికి రథంపై ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

దుర్గి: భక్తుల పాలిట కొంగుబంగారమై వెలసిన హరిహర బాలనాగేంద్రస్వామి ఆలయ 34వ వార్షిక మహోత్సవం సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని ధర్మవరం గ్రామంలో గత 33 సంవత్సరాలుగా వైభవంగా నిర్వహిస్తున్న తిరునాళ్ల మహోత్సవాన్ని ఈ సంవత్సరం కూడా వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామి వారికి సుప్రభాతం, విఘ్నేశ్వర పూజ, పాలాభిషేకాలు, నైవేద్యాలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. వేలాది మంది భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు. మహిళల కోలాటం ఆకట్టుకుంది. రాత్రి ఏర్పాటు చేసిన మ్యూజికల్ నైట్‌కు స్థానిక యువతీ యువకులతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున పాల్గొన్నారు. డీఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు సీఐ టి.వి.శ్రీనివాసరావు, ఎస్ఐ ఎల్ సుధీర్‌బాబు నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పత్తి మద్దతు ధర క్వింటాకు రూ.7,521



మాచర్ల రూరల్: రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతున్నట్లు వ్యవసాయాధికారి కట్టా లక్ష్మారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని కంభంపాడు గ్రామ రైతు భరోసా కేంద్రంలో రైతులనుద్దేశించి ఆయన మాట్లాడారు. పత్తి పంటకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం క్వింటాకు రూ.7,521 మద్దతు ధర నిర్ణయించిందని, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా వీటిని కొనుగోలు చేస్తున్నామని, రైతులు సేవా కేంద్రాలలో వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ వర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

విద్యార్థినికి ఆర్థిక సహాయం

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణానికి చెందిన గ్రంధి కీర్తికి మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గ్రంధి కీర్తి నరసరావుపేటలోని మిట్టపల్లి లక్ష్మయ్య ఇంజనీరింగ్ కాలేజీలో మొదటి సెమిస్టర్‌లో మంచి ప్రతిభ కనబరచటం, ద్వితీయ సెమిస్టర్‌కు సంబంధించి ఫీజు చెల్లించ లేకపోవటం వలన భగవాన్ శ్రీ సత్యసాయి బాబా మందిరం వారిని సంప్రదించగా వారు మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు ద్వారా రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. చారిట్రబుల్ ట్రస్ట్ చైర్మన్ కొత్త కోటేశ్వరరావు మందిరం కన్వీనర్ గర్రె నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

దివ్యాంగులకు వైద్య సేవలు



కారెంపూడి: స్థానిక సూర్యకిరణ్ మానసిక దివ్యాంగుల పాఠశాలలో మంగళవారం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ నాలుగవ అదనపు జిల్లా జడ్జి ఆర్ శరత్‌బాబు సూచనల మేరకు ఉచిత వైద్య శిబిరాన్ని, న్యాయ అవగాహన సదస్సును నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. న్యాయవాది రామాంజనేయులు, ఆర్థోపెడిక్ సర్జన్ ఉదయభాను, సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ రమ్య, నేత్ర వైద్య నిపుణులు లక్ష్మీనారాయణ, ఆడియాలజిస్ట్ మణికంఠ, ప్రిన్సిపాల్ పేర్ని పిచ్చెయ్య పాల్గొని సేవలందించారు.

తెలంగాణ మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

పిడుగురాళ్ల: అక్రమంగా తెలంగాణ మద్యాన్ని నిల్వ ఉంచిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ కె.కరణ అన్నారు. మండలంలోని శ్రీనివాసపురం గ్రామంలో తెలంగాణ మద్యాన్ని నిల్వ ఉంచిన దప్పిలి ఆంజనేయులురెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించామని తెలిపారు. అతని వద్ద 59 సీసాలను స్వాధీనం చేసుకున్నామని, అందులో 9 750 ఎంఎల్ మెన్షన్ హైస్ బ్రాందీ, 180 ఎంఎల్ పరిమాణం గల 50 సీసాలను స్వాధీనం చేసుకోవటం జరిగిందన్నారు. అతనిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచామని ఆయన తెలిపారు.

జిల్లా సమాఖ్య అధ్యక్షురాలిగా రజనీకుమారి

మాచవరం: జిల్లా సమాఖ్య అధ్యక్షురాలిగా మాచవరం మండల సమాఖ్య అధ్యక్షురాలు కోయ రజనీకుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో జరిగిన సమాఖ్య అధ్యక్షుల సమావేశంలో ఎన్నిక జరిగింది. జిల్లాలోని 28 మండలాలకు చెందిన సమాఖ్య అధ్యక్షులు రజనీకుమారి పేరును ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా రజనీకుమారి మాట్లాడుతూ మహిళా సాధికారతకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. తన ఎన్నికకు సహకరించిన ప్రజా ప్రతినిధులకు, జిల్లా అధికారులకు, సమాఖ్య అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

బీఎస్పీ నేతృత్వంలో చలో యడవల్లి

మాచర్ల రూరల్: బడుగు, బలహీన వర్గాల రాజ్యాధికారమే లక్ష్యంగా జనాభా దామాషా ప్రకారం సీట్లు పొంది బడుగుల రాజ్యం తెచ్చే లక్ష్యంతో బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో చలో యడవల్లి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బూదాల బాబురావు, గుండాల సైదులు యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ చిలకలూరి పేట నియోజకవర్గంలో చలో యడవల్లి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని దళిత రైతుల దగ్గర నుంచి అక్రమ జీఓలు తీసుకొచ్చి సొసైటీలు రద్దు చేసి వారి వద్ద తీసుకున్న భూములను వారికి తిరిగి ఇవ్వాలన్న లక్ష్యంతో ఈ నెల 23న నిరసన ర్యాలీ చేయనున్నట్లు చెప్పారు. ఈ ర్యాలీలో రాష్ట్ర అధ్యక్షులు పక్కా పరంజ్యోతి, పూర్ణచంద్రరావులు ప్రసంగిస్తారన్నారు. బీఎస్పీ నాయకులు కటారి రామకృష్ణ, వెంకట రామాంజి, అనిల్ తదితరులున్నారు.

కాపర్ వైర్ దొంగల అరెస్టు

గురజాల/వెల్దుర్తి : పంట పొలాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి కాపర్‌వైర్లను దొంగతనం చేసి అమ్ముకుంటున్న ముఠాను మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం డీఎస్పీ బి.జగదీష్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాచర్ల పట్టణానికి చెందిన మేడారం నాగరాజు, తమ్మిశెట్టి కిషోర్, జె.రాజులు ఒక ముఠాగా ఏర్పడి చెడు వ్యసనాలకు బానిసలై రాత్రి సమయంలో పంట పొలాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్లను దొంగిలిస్తున్నారు. వెల్దుర్తిలో 11, కారంపూడి 2, మాచర్ల 1, మాచర్ల రూరల్‌లో 1, రెంటచింతలలో 1, యర్రగొండ పాలెం 2, పుల్లలచెరువు 1 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల నుంచి కాపర్ వైర్లను దొంగిలించినట్లు డీఎస్పీ తెలిపారు. మండాది అడ్డరోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటోలో 250 కేజీల కాపర్ వైర్‌ను తరలిస్తున్నట్లు పోలీసులు గమనించారు. వారిపై అనుమానం రావడంతో విచారణ జరపగా నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. నిందితులపై గతంలో 4 కేసులు ఉన్నాయన్నారు. వీరు కాక మరొక రెండు ముఠాలు కూడా ఉన్నట్లు నిందితులు విచారణలో తెలిపారు. ఈ సమావేశంలో సీఐ నఫీజ్ బాష, ఎస్ఐ సమందర్ వలి తదితరులున్నారు.

కోతలు లేకుండా విద్యుత్‌ను సరఫరా చేయాలి



పిడుగురాళ్ల: కరెంట్ కోతలు లేకుండా ప్రజలకు విద్యుత్ సరఫరాను అందించాలని విద్యుత్ శాఖ మంత్రి ఓఎస్‌డీ ఏవీ సాంబశివరావు అన్నారు. పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో సర్కిల్ విద్యుత్ శాఖ ఉద్యోగులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని, ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులను తగ్గించాలన్నారు. అదే విధంగా విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పల్నాడు సర్కిల్ ఎస్ఈ పి.విజయకుమార్, ఈఈ ఆపరేషన్స్ సీహెచ్ రాంబొట్లు, ఈఈ టెక్నికల్ పల్నాడు సర్కిల్ కె.రామ్ సుబ్బారావు, ఈఈ ఎంఆర్‌టీ పల్నాడు జె.శ్రీనివాస్‌రెడ్డి, డోల్ ఆఫీసర్ ఎన్.సింగయ్య, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

పిడుగురాళ్ల: పట్టణంలోని శ్రీ దత్త హాస్పిటల్‌లో ఊపిరితిత్తుల సంబంధిత సమస్యలకు సంబంధించి వరల్డ్ ఊపిరితిత్తుల డే సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ నిర్వాహకులు తెలిపారు. ఈ వైద్య శిబిరం 20, 21, 22 తేదీలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించటం జరుగుతుందని, ఈ అవకాశాన్ని ఊపిరితిత్తుల సమస్యలు ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

జాబ్ మేళాలో 52 మందికి ఉద్యోగ అవకాశాలు



మాచర్ల రూరల్: వెనుకబడిన పల్నాటి ప్రాంతంలో విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ నిర్వహించిన జాబ్ మేళాలో 52 మంది ఉద్యోగాలకు ఎంపికై నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు తెలిపారు. మంగళవారం ఎస్‌కేబీఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో ఎంపికైన విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ జాబ్‌మేళాకు నాలుగు కంపెనీల ప్రతినిధులు హాజరు కాగా 77 మందికి గాను 52 మంది నిరుద్యోగులు ఎంపికయ్యారని చెప్పారు. ఈ జాబ్ మేళాలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.లక్ష్మీకుమారి మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు జాబ్ మేళా నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పించిన సంస్థకు అభినందనలు తెలిపారు. ఉద్యోగ అవకాశాలు పొందిన విద్యార్థులకు ఆశీర్వాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో నైపుణ్య సంస్థ అధికారి ఎం.రవీంద్ర నాయక్, స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ కిరణ్ నాయక్, శ్రీకాంత్ తదితరులున్నారు.

స్వచ్ఛ మున్సిపాలిటీగా మాచర్లను ఏర్పాటు చేద్దాం

మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు



మాచర్ల రూరల్ : పట్టణాన్ని స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు పట్టణ పౌరులందరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు కోరారు. మంగళవారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్ 2024 పోటీలో మెరుగైన ర్యాంకును సాధించేందుకు మాచర్ల పట్టణాన్ని చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు గ్రీన్ సిటీగా, క్లీ సిటీగా ఉంచేందుకు ప్రజలు బహిరంగ ప్రదేశాలలో మూత్ర విసర్జన చేయకుండా, తడి, పొడి చెత్తను నివాసాల వద్ద విభజించి కార్మికులకు అందజేయాలని కోరారు. ప్రజలందరూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుద్ధ్య కార్మికులకు సహకరించాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో మల, మూత్ర విసర్జన చేస్తే రూ.500 జరిమానా విధించనున్నట్లు చెప్పారు.

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకే పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మాచవరం: 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మండల కేంద్రమైన మాచవరంలోని జీకే పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని గ్రంథాలయ అధికారిణి సుజాత తెలిపారు. న్యాయ నిర్ణేతగా జీకే స్కూల్ ప్రిన్సిపాల్ జి.శ్యాం వ్యవహరించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

గ్రంథాలయంలో మహిళా దినోత్సవం

దుర్గి: మండలంలోని గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మంగళవారం గ్రంథాలయాధికారి పి.వి.గోపి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క మహిళా శ్రద్ధగా చదువుకొని ఉన్నతంగా ఎదగాలన్నారు. ప్రస్తుత కాలంలో మహిళలు అన్ని రంగాలలో ఉన్నతంగా ఎదుగుతున్నారన్నారు. అదే బాటలో విద్యార్థులు ఉన్నతంగా ఎదిగేందుకు చదువు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

పునీత అంతోని జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి



సమిష్టి దివ్యపూజాబలిని సమర్పిస్తున్న రెవరెండ్ ఫాదర్ మర్రి అనిల్

రెంటచింతల: ప్రేమజీవి పునీత అంతోని జీవితాన్ని కతోలికులందరూ ఆదర్శంగా తీసుకోవాలని కారంపూడి చర్చి విచారణ గురువులు రెవ.ఫాదర్ మర్రి అనిల్ కోరారు. స్థానిక అంతోని వారి చర్చిలో నిర్వహిస్తున్న 9 మంగళవారోత్సవాలను పురస్కరించుకుని కానుకమాత చర్చి విచారణ గురువులు రె.ఫాదర్ ఏరువ లూర్దు మర్రెడ్డి ఆధ్వర్యంలో ఆయన 5వ మంగళవారం సమిష్టి దివ్యపూజా బలిని సమర్పించారు. ఈ సందర్భంగా రెవ.ఫాదర్ అనిల్ భక్తులను ఉద్దేశించి అంతోనివారి త్యాగమయ జీవితంపై మాట్లాడారు. క్రీస్తు ఆరాధికులు పునీత అంతోని వారి అడుగుజాడలలో నడిచి ఆపదలో నున్న వారి పట్ల ప్రేమ, దయ, కరుణ చూపి నిజమైన కతోలికులుగా మెలగాలన్నారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. అంతోని వారి చర్చిని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ పూజా బలిలో సహాయ గురువులు అగస్టీన్, కన్యా స్త్రీలు, చర్చి పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

పాతగణేశునిపాడులో రెవెన్యూ అధికారుల విచారణ

సాక్షి ఎఫెక్ట్

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల మండలంలోని పాతగణేశునిపాడు గ్రామంలో పేదవాడికి అందించాల్సిన రేషన్ బియ్యం పేదలకు అందుతున్నాయా లేదా అనే అంశంపై పిడుగురాళ్ల రెవెన్యూ శాఖ అధికారులు మంగళవారం విచారణ కార్యక్రమం చేపట్టారు. సాక్షి దినపత్రికలో 'పేదవాడికి రేషన్ పరేషాన్' అనే శీర్షికన సోమవారం కథనం ప్రచురించిన సంగతి పాఠకులకు విదితమే. దీంతో రెవెన్యూ అధికారులు స్పందించి పాతగణేశునిపాడు గ్రామంలో రేషన్ సరఫరా వాహనం, కార్డుదారుల వద్దకు వెళ్లి రేషన్ సక్రమంగా అందిస్తున్నారా లేదా అని విచారణ చేశారు. తమకు రేషన్ వాహనం రావటం లేదని, ఒక గోదాములో ఏర్పాటు చేసిన రేషన్ షాపు వద్దకు వెళ్లి తీసుకొని రావాల్సి వస్తుందని కార్డుదారులు రెవెన్యూ అధికారులకు తెలిపినట్లు సమాచారం. మొత్తం మీద పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం అందించకుండా నామమాత్రంగా అందిస్తూ నల్లబజారుకు తరలిస్తున్నారు. కార్డుదారుల వద్ద డీలర్లే కొనుగోలు చేసి నల్లబజారుకు అధిక ధరలకు విక్రయించుకుంటున్నారని అందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే.

సత్రశాలలో కార్తిక మాస ప్రత్యేక పూజలు



సత్రశాల దేవస్థానంలో అన్నదానం చేసిన దాతలు, అన్నదాన కమిటీ సభ్యులు

రెంటచింతల: మండలంలోని సత్రశాల వద్ద వేంచేసిన అతి పురాతన శైవక్షేత్రం గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి దేవస్థానంలో కార్తిక మాసం సందర్భంగా భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వార్లను దర్శించుకున్న భక్తులకు, వివిధ స్వామి మాలలు స్వీకరించిన మాలధారులకు పరాశక్తి సిమెంట్స్ సత్రశాల ప్రోసెస్ డిపార్ట్‌మెంట్ వారు, పోట్ల నర్సింహారావు, హనుమాయమ్మ, పాశం శివారెడ్డి, లక్ష్మిగురవమ్మ, పులుకూరి శ్రీనివాసరావు, ప్రసన్న దంపతులు మహాన్నదానం చేశారు. అర్చకులు చిట్టేల మల్లిఖార్జున స్వామి శర్మ నేతృత్వంలో స్వామి వార్లకు ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలను, రుద్ర, గణపతి హోమాలను నిర్వహించారు. అనంతరం దాతలను ఈఓ గాదె రామిరెడ్డి, అన్నదాన కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ



రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలోని ఆంజనేయస్వామి మాణ్యం కాలనీలో మంగళవారం రాత్రి అయ్యప్పస్వామి పడిపూజ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. కాలనీకి చెందిన చదరంగం ఏడుకొండలు, అనురాధ దంపతుల నేతృత్వంలో అయ్యప్ప పడిపూజ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రధాన అర్చకులు అనీల్ కుమార్‌శర్మ స్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామికి 18 రకాల అభిషేకాలతో పాటు పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. అయ్యప్పస్వాములతో పాటు వివిధ మాలధారులు, భక్తులు చేసిన అయ్యప్ప నామస్మరణతో ఆంజనేయస్వామి మాణ్యం కాలనీ మార్మోగింది. అయ్యప్ప జీవిత చరిత్రకు సంబంధించిన పాటలతో పులకించిపోయింది. అరటి బోదలతో ఏర్పాటు చేసిన అయ్యప్పస్వామి మండపం, 18 మెట్లు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మాలధారులకు కొండలుస్వామి తీర్థప్రసాదాలను అందజేసి, భిక్ష ఏర్పాటు చేశారు.

అధిక రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

మాచవరం: పంటల సాగులో అధికంగా రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి పి.ప్రవీణ్ అన్నారు. మండలంలోని వేమవరం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుక్కిలో భాస్వరం ఎరువులు వాడిన తర్వాత భాస్వరం కలిగిన కాంప్లెక్స్ ఎరువులు వాడకూడదన్నారు. అధికంగా రసాయన ఎరువుల వాడకం వలన రైతులకు అధిక ఖర్చు, ప్రభుత్వానికి సబ్సిడీ భారం, పంట భూములకు నష్టం వాటిల్లుతుందని తెలియజేశారు. భూసార పరీక్షల ఆధారంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు, సలహాల మేరకు ఎరువుల వాడకం చేపట్టాలని తెలిపారు. పంటల సాగులో రసాయన మందుల వాడకం తగ్గించుకొని, సేంద్రీయ పద్ధతులను పాటిస్తూ పర్యావరణాన్ని కాపాడుకోవాలని సూచించారు. పత్తి, కంది సాగులో సస్యరక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఏఓ కె.రామమ్మ, గ్రామ వ్యవసాయ సహాయకులు నర్సయ్య, వంశీ, రైతులు పాల్గొన్నారు.